International Journal of Academic Research
ISSN: 2348-7666; Vol.6, Issue-2, February, 2019
Impact Factor: 6.023; Email: drtvramana@yahoo.co.in

# ఆముక్త మాల్యద - మాలదాసరి వైష్ణవ భక్తి ప్రపత్తులు

డా॥ సి.హెచ్.ఎమ్.ఎస్.కుమారి
తెలుగు అధ్యాపకురాలు
మిసెస్.ఏ.వి.ఎన్.కళాశాల
విశాఖపట్నం
chmskumari@gmail.com

శ్రీకృష్ణదేవరాయలు 1509-30 సంవత్సరాల మధ్య విజయనగర సామ్రాజ్యాన్ని పాలించి, భారతదేశ చరిత్రలోనే గొప్ప రాజుగా వెలుగొందారు. అటు కదనంలోను, ఇటు కవిత్వంలోనూ అసాధారణమైన ప్రతిభ చూపి, సాహితీ సమరాంగణ సార్వభౌముడిగా పేరుపొందారు. ఆంధ్రభాషాభిమానమెక్కువ కనుకనే "దేశభాషలందు తెలుగులెస్స"న్నారు. ఔదార్యంలో, కవిపోషణలో భోజమహారాజుతో పోల్చబడి "ఆంధ్ర భోజుడ"నే బిరుదు పొందాడు. శ్రీకాకుళాంధ్రమహా విష్ణువు కలలో కన్పించి అడుగుగా తానీగ్రంథాన్ని రచించానని తెలిపాడు. రాయలు వైష్ణవ మతావలంబి, తిరుపతి, అహోబిలం, శ్రీకాకుళం, సింహాచలం అనేకసార్లు తీర్థయాత్రలు చేసి, కంఠమాలలు, నవరత్నఖచిత పీతాంబరము, ముత్యాలు, వజ్రాలు, వరహాలు, శంఖచక్రాల పదకము సమర్పించినట్లు, తన భార్యలు చిన్నాదేవి, తిరుమలదేవి చేతను సమర్పింపచేసినట్లును శాసన ప్రమాణాలున్నాయి. ఇవన్నియూ వైష్ణవ మతాభినివేశానికి మచ్చుతునకలు, తన ఇష్టదైవమైన తిరుపతి వేంకటేశ్వరునికే ఈ గ్రంథాన్ని అంకితంచేసి, ఇష్టదేవతాస్తుతి యందు వేంకట భర్తకు (1వ) అనంతునికి (2వ) గరుత్మంతునికి (3వ) విష్వక్సేనునికి (4వ) సుదర్శన చక్రానికి (5వ) పాంచ జన్యానికి (6వ) కౌమోదకీ గదకు (7వ) శార్జ్గమునకు (8వ) నందకమునకు (9వ) పన్నిద్దరాళ్వారులకు (10వ) మాత్రమే స్థానముంది. అన్యదైవ ప్రసక్తిలేదు.

**నాటి మత పరిస్థితులు:** ఓరుగల్లు నాక్రమించిన మహమ్మదీయులు తెలుగుదేశమంతటా వ్యాపిస్తూ, తమ ఘోరకృత్యాలను సాగిస్తూ వుండగా, హిందువుల్లో కూడా మతభేదాలేర్పడి, పరస్పర వైషమ్యాలు ఎక్కువయ్యాయి. కృష్ణదేవరాయలే తన "ఆముక్తమాల్యద"లో ఈ విధంగా తెలిపాడు. ఒక పాండ్యరాజును గూర్చి విష్ణుచిత్తునితో శ్రీరంగనాథుడిట్లనెనట.

> "వెర్రిశైవంబు ముదిరి మద్వినుతి వినడునతి యొనర్చడు మామక ప్రతిమలకును
> హరుడె పరతత్త్వమను మదీయాలయముల నుత్సవంబులకులుకు నెయ్యురునునట్లె"
>
> "శివలింగము దాల్చిన జన నివహంబేమైన జేయనిది పాపము దా
> నవుగాదనడాసమయమున నవునను విప్రులకె యగ్రహారములిచ్చున్.

ఆ పాండ్యరాజు శైవులు గంజాయి తాగినను చూచి చూడనట్లుండి, విప్రుల తప్పు కొంచెమైనను పంచాయతీ సభకెక్కించి, వారికి శాస్తి చేయించెననియు, ఆ రాజును నమ్మించుటకై యిష్టములేకున్నను ఇతరులు రుద్రాక్ష పేరులు మెడనిండా ధరించి, చంకలో వీరశైవ పుస్తకమగు సూత సంహితుల నిర్మించుకొని తిరిగిరనియునిదే సందర్భంలో తెలిపాడు. రాజులును, మతాచార్యులును ప్రజల్ని బాధించటం వల్ల హిందువుల్లో పరస్పర ద్వేషాలు ప్రబలుట వల్ల శైవులను వైష్ణవులుగా మార్చుట, వైష్ణవమత ప్రచారాన్ని వైష్ణవ కవులు కూడా చేశారు. అందువల్ల విజయనగరారంభదశలో వైష్ణవమత వ్యాప్తి కన్పిస్తుంది.

"ఆముక్తమాల్యద" - విష్ణుభక్తిని వెల్లడించటానికి, విశిష్టాద్వైత సిద్ధాంతాన్ని వ్యాప్తిచేయుటానికి ఉద్దేశించింది. ఇందున్న అయిదు కథల్లో రెండు శ్రీమహావిష్ణువు చెప్పినవే. వాటిల్లో ఒకటి మాలదాసరి కథ. దీనికి మూలం వరాహ

పురాణం. పోతనార్యుడు ఆంధ్రమహాభారతంలో ప్రహ్లాదునిచే తొమ్మిది భక్తి మార్గాలను వివరించారు అందులో ఒకటి సంకీర్తనం. "నామలీలా గుణాదీనాం ఉచ్చైర్భాషాతు కీర్తనమ్" – భగవంతుని నామ లీల, గుణాదులను త్రికరణశుద్ధిగా గొంతెత్తి పాడుట లేక కీర్తించుట. మాలదాసరి సంకీర్తన భక్తుడు. విష్ణుచిత్తునికి తులసివనంలో దొరకగా అల్లారుముద్దుగా పెంచాడు. భగవంతుని గూర్చి పాటలు పాడుతూ, ఆరాధిస్తూ, ప్రేమించింది. తండ్రి ఈ విషయం తెలుసుకొని, కుమార్తె చిక్కిపోతుందని విష్ణుమూర్తికి విన్నవించుకొనగా, అతనికి "సంకీర్తన" మహిమను తెల్పే ఈ మూలదాసరి కథ"ను చెప్పాడు. ఈ లోకంలో విష్ణువు వామనావతరం ధరించి నివసించిన ప్రదేశానికి మూడు ఆమడల దూరంలో వున్న ఊరులో నివసిస్తున్న విష్ణుభక్తుడైన మాలదాసరి ప్రతీరోజు వేకువజామునే గుడికి వెళ్ళి మంగళకైశికీరాగంలో పాటలు పాడుతూ, స్వామి ప్రీతికోసం తనజాతికి తగిన నడవడికనే కలిగి, తన మనస్సును పవిత్రంగా ఉంచుకొనేవాడు.

**దాసరి వేషధారణ :** చమురు రాసిన తోలు చొక్కా, తలకు టోపీ, చెవులకు ఇత్తడితో చేసిన శంఖ చక్రాలవలె కమ్మలు ధరించి, చేతిలో గరుడ స్తంభం, తోలు సంచి, భుజానికి సొరకాయ వీణ, చిన్న తాళాలు, చంకలో బుట్ట, కంఠంలో తులసి పూసలమాలలు, మాసినదేహం, తిరుమణితో పెట్టుకొన్న పెద్దనామాలు, పసుపురాసిన తోలుజందెం ధరించేవాడు. ఈ విధంగా వైష్ణవమాత సంప్రదాయాలకనుగుణంగా దాసరి ఆహార్యం వర్ణించబడింది ఆ శరీరం, ఈ మనసు కలిగి మసిపాతలో కట్టిన మాణిక్యం వలె ఉండేవాడు.

"గండభోగములన్మదశ్రులహరుల్గప్పన్నుతుల్పాడియా
దండస్వేగులుడించి భక్తిజనితోద్యత్తాండవంబాడు, నా
చండలేతరశీలు, డుత్పులకియై చాండోలికన్మీటుచున్
గుండుల్నీరుగ, నెండగాలి పసితాకుంజాడకాప్రాహ్ణమున్"

దాసరి గుడికి చేరగానే తనమీదున్న బరువుల్ని దించి, విష్ణుస్తోత్రాలు పాడుతూ, భక్తితో నృత్యం చేసేవాడు, శరీరం పులకిస్తుంటే ఆనందభాష్పాలు రాలడం, ఎండా, గాలి, ఆకలి అనేవి పట్టించుకోకపోవడం, రాళ్ళు కూడా కరిగేటట్లు వీణమీటుతూ నృత్యంచేయడమనే విషయాలు దాసరి భక్తి పారవశ్యాన్ని తెలుపుతున్నాయి. అతని గానంలో రాళ్ళు కూడా కరిగిపోయేటటువంటి మాధుర్యం ఉండడం విశేషం. ఇతని సంకీర్తన భక్తి మార్గం మధురాతి మధురమైంది. ఇంతటి భక్తుడు కనుకనే విష్ణువుని గూర్చి పాడిన మంగళకైశికీరాగపుపాట చివరి చరణ ఫలితం రాక్షసుణ్ణి కృతార్థుణ్ణి చేసింది. ఇది కృష్ణదేవరాయల భక్తి పారమ్యాన్ని తెలుపుతుంది. దాసరిని "మహాత్మా!" అని సంబోధించి (4వ 6 ఆ), మహాభక్తుడని కొనియాడుతూ (3–10వచ 6 ఆ) భక్తి కులం కంటే అతీతమైందని నిరూపించారు. ఒకనాటి అర్ధరాత్రి పిల్లి దాసరి ఇంట్లో ప్రవేశించగా కోళ్ళు సద్దుచేశాయి. ఆ శబ్దం విని గుడికి వేళయ్యిందని బయలుదేరి చీకటిలో దారితప్పి అడవిలో పాడుబడిన ఒక గ్రామంలో నడుస్తున్న మర్రిచెట్టు మీదున్న బ్రహ్మరాక్షసుణ్ణి చూసాడు. వాడు దాసరిని చూచి పోవద్దంటూ కిందికి దుమికాడు, ఇద్దరూ కొంతసేపు పోరాడారు. మెడకోసి నీ వెచ్చని రక్తం తాగుతానంటూ రాక్షసుడు ఆడదెయ్యాల సాయంతో పేగులతో దాసరిని బంధించగా, ధర్మం తెలిపే మంచి మాటల్నిలా పలికాడు – "ఓ రాక్షసుడా! పోరాడకుండా ప్రాణరక్షణ నిర్లక్ష్యం చేయడం పాపం అందుకే నీతో పోరాడాను. నాకు శరీరం మీద కోరిక లేదు. నీచపు పుట్టుక నశించడం, ఒక ప్రాణిని సంతోషపెట్టడం, మోక్షం పొందడం మంచిది కదా ! ప్రాణభయం మనుషులకు ఒక రోజైతే, రాక్షసులకు మరో రోజవుతుంది. హిరణ్యకశిపాదులు దేవతలను హింసించి చివరికి యమునిబారిపడలేదా! ప్రాణుల మధ్య తేడా వాని స్థానబలంచేత వుంటుంది. యముని నగరంలో బాధ మాకు, మీకు కూడా తప్పదు.

**కురుగుడికి వెళ్ళి విష్ణువుని గూర్చి పాడి తిరిగి వచ్చుటకు ప్రమాణం చేయడం:** దాసరి రాక్షసునితో ఇలా అంటాడు "నేను మానవుణ్ణి, హీనజాతివాణ్ణి. నీవు రాక్షసుల్లో శ్రేష్టునివి. ఇంకా నీకు మంచి పేరు వచ్చే మార్గం చెబుతాను. ఏడు అడుగులు నడిస్తే మిత్రులంటారు. (సఖ్యం, సాప్తపదీనమ్) మిత్రుడిగా నాదొక విన్నపం. నేనొక వ్రతాన్ని ఆచరిస్తున్నాను. ఈ దగ్గరలో ఉన్న కురుగుడికి వెళ్ళి విష్ణువుని మంగళకైశికీగానంతో ఆఖరిసారి స్తుతించి వచ్చి నీకాహారమవుతానుననగానే, రాక్షసుడు – నన్ను తక్కువుగా భావించి తప్పించుకోవాలనుకుంటున్నావా? ఏ దేశంలో మనుష్యుడు నోటిదగ్గరకు వచ్చిన ఆహారాన్ని పోగొట్టుకుంటాడు? ఏ దేశంలో మానవుడు తనమాటనిలుపుకోవడానికి శరీరమివ్వడానికి మళ్ళీవస్తాడు? కాబట్టి నిన్ను నేను వదలనని" ఖండితంగా చెప్పాడు. అతనికి నమ్మకం కలిగే విధంగా ఒక ప్రమాణం చేసాడు. అదీ పద్యంలో –

"ఎవ్వని చూడ్కింజేసి జనియించు జగంబు వసించునిజ్జగం
బెవ్వనియందు డిందు మఱియెవ్వనియందిది యట్టివిష్ణుతో
నివ్వల నొక్కవేల్పు గణియించిన పాతకినౌదు నేడ నే
నెవ్విధినైన నిన్గదియనేని యనన్విన బంధమూడ్చినన్"

ఈ రోజు నేను ఏదో విధంగా నీ దగ్గరకు రాకపోతే ఎవరిచేత ఈ లోకం సృష్టింపబడిందో, ఎవరిలో ఇది నిలుస్తుందో, చివరికి ఎవరిలో లయమవుతుందో అటువంటి విష్ణువునకు సమానంగా మరో దైవాన్ని స్మరించిన పాపాన పోతాను. ఇది నమ్మి నన్ను వెళ్ళనివ్వమనగానే ఒప్పుకొని దాసరి బంధాన్ని తొలగించాడు. ఈ జగత్తు సృష్టి, స్థితి, లయకారుడైన విష్ణువుకు సమానమైన దైవం లేదనే వైష్ణవమత ప్రతిపాదికత్వాన్ని రాయలు ఈ పద్యంలో నిరూపించారు. భాగవతంలో పోతన గజేంద్ర మోక్షమున "ఎవ్వనిచే జనియించు జగమెవ్వని లోపలనుం–" (అ.స్కం.ప.73) అనే పద్యంలో శ్రీహరి నిర్గుణతత్వాన్ని వర్ణించగా, పోతన తరువాత కవియైన శ్రీకృష్ణదేవరాయలు వైష్ణవమతస్థాపనావసరమున నిర్గుణ పరబ్రహ్మమునిట్లభివర్ణించాడు. ఈ పద్యం పోతన ప్రభావం.

**దాసరి గొప్పదనాన్ని గ్రహించి రాక్షసుడు ప్రశ్చాత్తాపపడుట:**

దాసరి గుడికి వెళ్ళి విష్ణుమూర్తికి సాగిలపడి మొక్కి వీణను మీటుతూ స్తోత్రపు పాటలను పరవశంతోపాడి, వ్రతాన్ని పూర్తిచేసుకొని, అసత్యభయంతో వేగంగా రాక్షసుని దగ్గరకు వచ్చి "ఓ రాక్షసా! నీవు నా వ్రతాన్ని సఫలం చేశావు. ముక్తి కలిగింది. నీవు పంపేటప్పుడు ఎట్లా ఉన్నానో, ఇప్పుడట్లాగే ఉన్నాననగానే దాసరి సత్యసంధతకు రాక్షసుడు ఆనందబాష్పాలతో దాసరి పాదాలు పట్టుకొని నీ సత్యసంధతమెచ్చుకోతగిందంటూ –

"ఇతరులు నీకు నీడె మఱి? యీ ధృతి, నీ స్మృతి, నీ ఋతేరిత
స్థితగతి నీమురారిపదసేవన జీవనవన్మతిన్, సమా
దృత కలగాన సింధులహరీ ప్లవన ప్లవభావభాగురు
శ్రుతి తతబద్ధతుంబికి, గురుంగుడినంబి కృపావలయంబికిన్"

ఈ విషయంలో నిన్ను మించిన వారులేరు. కురుగుడి స్వామి దయకు పాత్రుడివయ్యావు. ధైర్యం, జ్ఞానం, సత్యం విష్ణుపదసేవాజీవనంలో నీకు సమానులెవరు "అని ప్రశంసించాడు. అందుకు దాసరి నన్ను భక్షించి ఆకలి తీర్చుకోమనగానే రాక్షసుడు ఇన్నాళ్ళు ఈ నరమాంశపు కూటితోనే మహాపాపం చేసి శరీరాన్ని పోషించాను. ఎన్నాళ్ళకైనా ఒక తపస్విగాని, వ్రతనిష్టుడుగానీరాడా! అతని దయతో ఈ రాక్షసజన్మ వదిలించుకుంటుననుకున్నాను. నీలాంటి భాగవతులు మమ్మల్ని పావనుల్ని చేయగలరు. నువ్వు దేవాలయంలో గానం చేసి ఎంతో పుణ్యం సంపాదించావు. ఈ రోజు నీ గానం వల్ల

నువ్వు సంపాదించుకున్న పుణ్యం నాకు దానం చేసావంటే, ఈ రాక్షస జన్మ పోతుందనగానే దాసరి నవ్వి, ఇంతకంటే మంచి జన్మలు, చెడ్డజన్మలు ఎన్నో ఎత్తినవాణ్ణి. కాని విష్ణుభక్తుడు కావడం ఒక్కటే జరగలేదు. శరీరం కోసం పుణ్యం అమ్ముకోవటం, కర్పూరం యిచ్చి ఉప్పు కొనుక్కున్నట్లు కనుక అది మాత్రం అడగవద్దన్నాడు. ఒకరోజు పుణ్యంలో సగభాగమైన, తరువాత పాతికపాలైన ఇవ్వమనగా, అందుకు దాసరి ఇవ్వనన్నాడు. పోనీ ఈ రోజు ప్రభాతసమయంలో పాడిన చివరిపాట ఫలితమైన ఇచ్చి దయచూడుమని పాదాలపై పడి లేవకుండా ప్రాధేయపడగా, దాసరి దయాళువై "అట్లే కానీ అని లేవనెత్తి అసలు ఈ వికృతరూపం కలగడానికి కారణం చెప్పుమనగా – పూర్వ జన్మలో సోమశర్మ అనే బ్రాహ్మణుడు కుంభజానువైన విధం చెప్పాడు. మానవ జీవితంలో రాక్షసతత్వమే రాక్షసుడు కావడానికి కారణమనే విషయం అతని పూర్వవృత్తాంతంవల్ల తెలుస్తుంది. దాసరి "మిత్రమా ! నువ్వు పుణ్యఫలమడుగుతున్నావు. కానీ నేను చేసిన గానకైంకర్యానికి ఫలమేమిటో తెలియదు. దీని ఫలం భగవంతుణ్ణి రంజింపజేయుటయే. నువ్వు భయపడకు, ఆ శ్రీహరి ఏదోలా నిన్ను రక్షిస్తాడ"నగానే ఆ రాక్షసుడు రూపం మారిపోయింది. తెల్లటి యజ్ఞోపవేతంతో ఊర్ధ్వ పుండ్రాలతో, తులసిపూసల మాలలతో వైష్ణవుడైన సోమశర్మగా మారిపోయి దాసరికి నమస్కరించి, పూజించి సంసార సుఖాలపట్ల విరక్తి పొంది తీర్థ యాత్రలు చేస్తూ, చివరికి మోక్షాన్ని పొందాడు.

డా॥ జి.నాగయ్య తన తెలుగు సాహిత్య సమీక్ష రెండవ సంపుటంలో "దాసరి బ్రహ్మరాక్షసుల సంవాదం వైష్ణవ మతోత్కర్షను స్థాపించుట కొరకే ఆముక్తమాల్యదలో చెప్పబడిందని, విష్ణుభక్తి కీర్తన ప్రభావం వల్లనే బ్రహ్మరాక్షసునికి పూర్వ పాప విమోచనం కలిగి విష్ణుసాయుజ్యం లభించిందని, " మాలదాసరి బ్రహ్మరాక్షసునికి తన కౌశికీగాన ఫలమును దానముగానొసగి, అతనిని తరింపజేసెను కనుక ఇచ్చట దానవీరము" అని తెలిపారు. మాలదాసరి పరిపూర్ణ వైష్ణవభక్తుడు. శ్రీకృష్ణదేవరాయలు సంపూర్ణవైష్ణవభక్తుడే, కనుకనే మాలదాసరి పాత్రద్వారా భగవద్భక్తితత్పరత, తన్మాధుర్యం, తద్విశిష్టతను భావింపజేసి, భగవద్భక్తులందరిలో ఇట్టి ఉత్కృష్టమైన భక్తిని వెల్లడించారు.

**ఆధార గ్రంథాలు :**

1) ఆముక్తమాల్యద – శ్రీకృష్ణదేవరాయలు

2) ఆంధ్రుల సాంఘిక చరిత్ర – సురవరం ప్రతాపరెడ్డి

3) తెలుగు సాహిత్య చరిత్ర – తృతీయ భాగము – ఆచార్య కొర్లపాటి శ్రీరామమూర్తి

4) ప్రబంధ కథ కదంబం – అయిదు ప్రసిద్ధ ప్రబంధకథలు – మల్లాది హనుమంతరావు

5) తెలుగు సాహిత్య సమీక్ష – ద్వితీయ సంపుటం – డా॥ జి. నాగయ్య

6) సమగ్రాంధ్ర సాహిత్యము – ఆరుద్ర

7) ఆంధ్ర సాహిత్య చరిత్ర – పింగళి లక్ష్మీ కాంతం

8) గోసంగి – దళిత దీర్ఘ కావ్యం – ఎండ్లూరి సుధాకర్